క్లుప్తంగా

రామావతారంలో భజే నారాయణస్వామి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

రంగంపేట: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా వడిశలేరు గ్రామంలో కొలువైన భజే నారాయణస్వామిని మంగళవారం రామావతారంలో అలంకరించారు. స్వామికి ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి భజే నారాయణస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా.. బుధవారం కృష్ణావతారంలో స్వామివారు దర్శనమిస్తారని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి పి.ప్రియాంక తెలిపారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష తులసి పూజ



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

బిక్కవోలు: ఊలపల్లి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం లక్ష తులసి పూజను ఘనంగా నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

11న కోరుకొండ మండల పరిషత్ సమావేశం

మధురపూడి: కోరుకొండ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్యసూర్యకుమారి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మండలంలో నిర్వహించిన అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందన్నారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

పంటల బీమాకు 15 వరకూ అవకాశం

రాజానగరం: పంటల బీమా పథకంలో చేరేందుకు ఈ నెల 15వ తేదీ వరకూ గడువును పొడిగించారని, రబీ సాగు చేసే రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్కే ఇమామి ఖాసిమ్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని నరేంద్రపురం, నందరాడ గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంటల బీమా పథకం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. మండలంలో ప్రస్తుతం రబీలో 10,200 ఎకరాలలో వరిని సాగు చేస్తున్నారన్నారు. నాట్లు వేసిన తరువాత 15 నుంచి 20 రోజుల వ్యవధిలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు.

పారిశుధ్య పనులు



దొడ్డిగుంటలో తుప్పలు తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

రంగంపేట: మండల పరిధిలోని దొడ్డిగుంటలో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని డ్రైనేజీల్లో సిల్టు తొలగింపు, వీధిలైట్లు మరమ్మతులు, తాగునీటి ట్యాంకుల శుభ్రం తదితర పనులు చేపట్టారు. ముత్యాలమ్మగుడి వీధిలో పేరుకుపోయిన తుప్పలను తొలగించారు. ఈ పనులను పంచాయతీ కార్యదర్శి కాత్యాయని పర్యవేక్షించారు.

బాధిత కుటుంబానికి సాయం

రాజానగరం: మండలంలోని చక్రద్వారబంధంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి, సర్వం కోల్పోయిన కోనే వీరబాబు కుటుంబానికి పలువురు సాయమందిస్తున్నారు. దీనిలో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఆళ్ల శివనాగరాజు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు కొంత నగదు, నిత్యావసర వస్తువులను ఆ కుటుంబానికి మంగళవారం అందించారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం శివారున పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ మంగళవారం తెలిపారు. వారిలో వంగలపూడికి చెందిన ఒకరు, రఘుదేవపురానికి చెందిన ముగ్గురు ఉన్నారన్నారు. నిందితుల నుంచి రూ.5,400 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

పందేనికి రెడీ!



మామిడాడలో అమ్మకానికి సిద్ధం చేసిన పుంజులు

- జోరుగా సంక్రాంతి ఏర్పాట్లు
- గ్రామాల్లో సందడే సందడి
- బరిలో దిగడానికి సిద్ధమవుతున్న పుంజులు

బిక్కవోలు: తెలుగు ప్రజలందరికీ ఎంతో ఇష్టమైన పండగ సంక్రాంతి. కుటుంబ సభ్యులందరూ ఒక్కచోటకు చేరి, ఆనందోత్సాహాలతో జరుపుకొంటారు. ఏ పండగైనా ఒక్క రోజులో వెళ్లిపోతుంది. కానీ సంక్రాంతి సంబరాలు నాలుగు రోజులు జరుగుతాయి. ఈ నేపథ్యంలో పెద్ద పండగకు జోరుగా ఏర్పాట్లు జరుపుతున్నాయి. ముఖ్యంగా పందెం కోళ్లు బరిలో దిగేందుకు రెడీ అవుతున్నాయి. ఈ సీజన్‌లో వీటికి విపరీతమైన డిమాండ్ ఉంటుంది. పండగ రోజుల్లో నాలుగు డబ్బులు సంపాదించుకోవడానికి కొందరు ఈ పుంజులను సిద్ధం చేస్తారు. మరి కొందరు గ్రామీణ ప్రాంతాల్లో కోడి పుంజులను కొనుగోలు చేస్తారు. వాటిని సంక్రాంతి సందర్భంగా బరిలో దింపుతారు.

పుంజుల్లో రకాలు

పందెం పుంజులకు బలమైన ఆహారం అందిస్తూ వాటికి వ్యాయామంతో పాటు సకల పరిచర్యలు చేస్తున్నారు. పుంజు రకాన్ని బట్టి రూ.3 వేల నుంచి రూ.40 వేల వరకు ధర పలుకుతోంది. వీటిలో కాకి, డేగ, నెమలి, పరదా, పచ్చకాకి, పెట్టమారు, రసంగి, తీతువా, మైయిలా, సింగాలి వంటివి ఉన్నాయి. వాటి రంగును బట్టి ధర నిర్ణయిస్తారు. ఎక్కువగా పచ్చికాకి, డేగ రకాలపై మక్కువ చూపుతారు. ప్రస్తుతం వీటికి బాగా డిమాండ్ ఉంది.

బరులు సిద్ధం

కోడి పందేల కోసం నియోజకవర్గంలో బరులు సిద్ధమవుతున్నాయి. అనపర్తి మండలం దుప్పలపూడి, పేరా రామచంద్రపురం, మహేంద్రవాడ, బిక్కవోలు మండలం కొమరిపాలెం, బలభద్రపురం, బిక్కవోలు, రంగంపేట మండలం పెదరాయవరం, నల్లమిల్లి, రంగంపేట, పెదపూడి మండలం జి.మామిడాడ, అచ్యుతాపురం, పెదపూడి, గండ్రేడు సెంటర్, చింతపల్లి, శహపురం, వేండ్ర తదితర గ్రామాల్లో 20కి పైగా పందెం బరులు సిద్ధం చేస్తున్నారు.



మామిడాడలో తలపడుతున్న పందెం కోళ్లు (ఫైల్)

కోడిపందేల ముసుగులో జూదాలు

సంప్రదాయం పేరుతో కోడి పందేలు ఆడుతున్నప్పటికీ కొందరు వీటి ముసుగులో జూదాలు నిర్వహిస్తున్నారు. గుండాట, మూడు ముక్కలాట, కోతాట వంటివి యథేచ్ఛగా సాగుతున్నాయి. అలాగే బరులు వద్ద మద్యపాన ప్రియులకు ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేస్తారు. నాటు కోడి రుచులతో మందు అమ్మకాలు సాగిస్తారు. తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేసి ఖైనీలు, గుట్కాలు, సిగరెట్లను విక్రయిస్తారు.

అనుమతి లేదు



"కోడి పందేలు, పేకాట, కోతాట, గుండాటకు ఎలాంటి అనుమతులు లేవు. ఎవరైనా ఆడినా, ఆడించినా కఠిన చర్యలు తీసుకుంటాం. దీని కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గస్తీ ముమ్మరం చేశాం. కత్తులు కట్టే వాళ్లతో పాటు గతంలో కోడి పందేలు, పేకాటల్లో పట్టుబడిన వారిని బైండోవర్ చేస్తున్నాం. ఎక్కడైనా జూదాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలి."

– వాసంశెట్టి రవిచంద్ర కుమార్, ఎస్సై, బిక్కవోలు

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బిక్కవోలు: మండలంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన జరిపారు. ఆలయ ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది ప్రసాద్, రవి, సత్తిబాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సామవేదం ఆధ్యాత్మిక ప్రవచనం



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

పెదపూడి: అనపర్తి శారదా సంగీత కళా సమితి వారి 26వ త్యాగరాజు ఆరాధనా ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు ఎంతో ఆకట్టుకుంటున్నారు. వీటిలో భాగంగా ఐదో రోజు మంగళవారం త్యాగరాజ రామభక్తి అనే అంశంపై ఆయన ప్రసంగించారు. షణ్ముఖశర్మ మాట్లాడుతూ కలియుగంలో భగవదనుగ్రహంతో మెలగాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. ఆర్షధర్మానుసరణ భారతీయుల కర్తవ్యమని ప్రబోధించారు. ప్రముఖ నేత్ర వైద్యుడు టి.సత్యనారాయణరెడ్డి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నేత్ర వైద్యుడు తేతలి వెంకట రామారెడ్డి, ఆడిటర్ పి.రాఘవ శేషరాధాకృష్ణారావు, రాజమహేంద్రవరానికి చెందిన వైద్యుడు టీవీ నారాయణరావు, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తమలంపూడి చిన్న ఆదిరెడ్డి, ఉపాధ్యక్షుడు నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు



ఆరోగ్య మందిర్ పర్యవేక్షణాధికారి డాక్టర్ నవీనతో వైద్య సిబ్బంది

సీతానగరం: ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకే ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను నిర్మించిందని నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్స్ (ఎన్‌క్యూఏఎస్) పర్యవేక్షణాధికారి డాక్టర్ డి.నవీన అన్నారు. రఘుదేవపురం–3 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం (ఏఏఎం)లో మంగళవారం నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్స్ కమిటీ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యవేక్షణాధికారి డాక్టర్ నవీన మాట్లాడుతూ ఏఏఎంలో 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఎన్‌క్యూఏఎస్ నుంచి వారం రోజుల్లో రఘుదేవపురం – 3 కేంద్రానికి ధ్రువీకరణ పత్రం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఏవీకె చైతన్య, డాక్టర్ ఎస్.రాజు, టీమ్ మెంబర్ ఎస్.సుధ, ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి సంప్రదాయ క్రీడలు ప్రారంభం



జి.మామిడాడలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్సై రామారావు, గ్రామ పెద్దలు

పెదపూడి: సంప్రదాయ క్రీడలు ముద్దు.. జూద క్రీడలు వద్దు అని పెదపూడి ఎస్సై రామారావు అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని స్కూల్లో మంగళవారం సంప్రదాయ క్రీడలను నిర్వహించారు. వీటిని ప్రారంభించిన ఎస్సై మాట్లాడుతూ వాలీబాల్, కబడ్డీ, తదితర క్రీడలను ఆడేందుకు ఆసక్తి చూపాలన్నారు. జూద క్రీడలు ఆడి, జీవితాలు పాడుచేసుకోవద్దన్నారు. ఈ పోటీల్లో విజేతలకు కనుమ పండగ రోజు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, జుత్తక కృష్ణ, తమలంపూడి శివరామారెడ్డి, గోపిరెడ్డి, శ్రీనివాసారెడ్డి, ఏఎస్సై శ్రీనివాసు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ వర్క్‌షాపులో ఫొటోగ్రాఫర్ల ప్రతిభ



ప్రతిభ చూపిన ఫొటోగ్రాఫర్లు బుజ్జి, అభిరామ్

రాజానగరం: ఒడిశాలోని బొండాస్‌లో సోమ, మంగళవారాలలో జరిగిన హుస్సేన్ ఖాన్ 7వ నేషనల్ వర్క్‌షాపులో మండలానికి చెందిన ఇద్దరు ఫొటోగ్రాఫర్లు బహుమతులు అందుకున్నారు. శ్రీకృష్ణపట్నం బుజ్జికి వెండి పతకం, కొత్త తుంగపాడుకు చెందిన గొల్లపల్లి అభిరామ్‌కు తృతీయ బహుమతి దక్కింది. గిరిజన తెగలలో అంతరించిపోతున్న బొండా తెగకు సంబంధించి సంప్రదాయాలు, వేషధారణలు, నృత్యాలు, వారి జీవనశైలిపై తీసిన ఫొటోలతో ఈ వర్క్‌షాపు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి ఫొటోగ్రాఫర్లు, ఫొటో జర్నలిస్టులు హాజరయ్యారు. వీటిలో వీరిద్దరూ బొండా తెగకు సంబంధించిన తీసిన ఫొటోలకు పైబహుమతులను అందుకున్నారు.

రెవెన్యూ సదస్సుకు మూడు అర్జీలు



ముగ్గళ్లలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులు మూడు అర్జీలను అందుకున్నారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల కోసం రెండు, భూమిని సర్వే చేయాలని ఒక అర్జీ వచ్చాయి. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ బుధవారం బొబ్బిల్లంకలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని, దానిలో మండలంలో సదస్సులు పూర్తవుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో సర్వేయర్ గౌతమ్, వీఆర్వో చిన్నా, ఎండోమెంట్ ఈవో పాటి సత్యనారాయణ, సబ్ రిజిస్ట్రార్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి మాజీ ఎమ్మెల్యే పూజలు



వేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

పెదపూడి: కరకుదురు గ్రామంలో కొలువైన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని మంగళవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో వేణుగోపాలస్వామి కల్యాణం, లక్షపత్రి, గోదాదేవి పూజ చేశారు. ఆయన హయాంలో మంజూరు చేయించిన రూ.50 లక్షల సీజీఎఫ్ నిధులతో నిర్మించిన దేవతా కల్యాణ ముఖ మంటపాన్ని పరిశీలించారు. తమ చిరకాల కోరిక అయిన ఈ ముఖ మంటపం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, త్వరగా నిర్మాణం పూర్తి చేయించినందుకు గ్రామ పెద్దలు, భక్తులు.. సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వుండ్రు చంద్రకళ, ఆలయ కమిటీ చైర్మన్ యెండ్రు సుబ్బారావు, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, గ్రామ పెద్దలు వల్లూరి పట్టాభి, చుండ్రు వీర వెంకట సత్యనారాయణ, మేక రామకృష్ణ, మేక సత్యనారాయణ, వాసంశెట్టి మాధవ, పాటంశెట్టి త్రిమూర్తులు, ముప్పిడి సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాసిరకంగా మధ్యాహ్న భోజనం



గ్రామ సభలో మాట్లాడుతున్న తనిఖీ అధికారి రేణుక

సీతానగరం: రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో అందించే మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉందని, పాడైన గుడ్లు పెడుతున్నారని సామాజిక తనిఖీలో వెల్లడైంది. ఆ హైస్కూల్లో మంగళవారం సామాజిక తనిఖీ గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా తనిఖీ అధికారి ఎస్.రేణుక మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించగా పలు అవకతవకలు బయటపడ్డాయన్నారు. భోజనాలు చేసే విద్యార్థుల సంఖ్యకు, బియ్యం నిల్వలకు మధ్య వ్యత్యాసం ఉందన్నారు. ఆయా దురుసుగా ప్రవర్తిస్తోందని, నాసిరకం భోజనం పెడుతున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేశారన్నారు. భోజనం చేసే విద్యార్థులు తక్కువగా ఉన్నా, లెక్కల్లో అధిక సంఖ్యలో చూపుతున్నారన్నారు. నాలుగు నెలల నుంచి తేడా కనిపిస్తోందన్నారు. హెచ్‌ఎం శ్యామలాదేవి మాట్లాడుతూ రేషన్ షాపుల నుంచి వస్తున్న బస్తాలలో మూడు కిలోల చొప్పున బియ్యం తక్కువ ఉంటుందన్నారు. విద్యార్థులు ఆలస్యంగా పాఠశాలకు వస్తున్నారని, దీనివల్ల ఆన్‌లైన్ హాజరు కంటే ఎక్కువ మంది ఉంటున్నట్టు తెలిపారు. నాసిరకం గుడ్లు పెట్టడం లేదని, ఎక్కువగా ఉడకడం వలన పైతొక్క ఊడిపోవడంతో పాడైనట్టువిద్యార్థులు చెబుతున్నారన్నారు. ఆయాను మందలించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాశరావు, కె.భార్గవి, బీజేపీ మండల అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాగమ్మ తల్లి ఆలయంలో చోరీకి యత్నం

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని నాగమ్మ తల్లి ఆలయంలో చోరీకి దొంగలు ప్రయత్నించారు. ఆ సమయంలో ఆలయ గురువు గట్టిగా కేకలు వేయడంతో పరారయ్యారు. వివరాల్లోకి వెళితే.. గాడాల గ్రామంలోని నాగమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి ఆభరణాలను అపహరించడానికి సోమవారం అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు వచ్చారు. మోటారు సైకిల్‌పై వీరు గేటు తాళం బద్దలుకొట్టి లోపలకు వెళ్లారు. దొంగల రాకను ఆలయ సమీపంలో ఉన్న కుక్కలు గమనించి, గట్టిగా మొరగడం ప్రారంభించారు. వాటిని అరుపులు విని ఆలయ గురువు నాగబాబు, కుటుంబ సభ్యులు మేల్కొన్నారు. ఆ దొంగలను గమనించి, గట్టిగా కేకలు వేశారు. దీంతో ఆ ముగ్గురూ అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. దొంగలు వదిలేసిన మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డ్రోన్ సాయంతో వేపగింజల కషాయం పిచికారీ



డ్రోన్ పనితీరును వివరిస్తున్న సభ్యులు

బిక్కవోలు: ప్రకృతి వ్యవసాయ భాగంగా మండలంలోని బలభద్రపురం గ్రామంలో మంగళవారం డ్రోన్ సహాయంతో వేపగింజల కషాయం పిచికారీ చేశారు. ప్రకృతి వ్యవసాయ సభ్యులు ఆధ్వర్యంలో 23 ఎకరాల్లో కషాయం చల్లించారు. లీటరు వేపగింజల కషాయంలో పావు లీటర్ చొప్పున ఇంగువ, కుంకుడు రసం మిశ్రమాలు కలిపి లీటరున్నర చేశారు. దాన్ని పది లీటర్ల నీటిలో కలిపి డ్రోన్ సాయంతో స్ప్రే చేయించారు. ఎకరానికి రూ.400 చొప్పున తీసుకున్నారు.

20 నుంచి మిర్తిపాడులో భూముల రీసర్వే

సీతానగరం: మండలంలోని మిర్తిపాడులో ఈ నెల 20వ తేదీ నుంచి భూముల రీసర్వే పక్రియను ప్రారంభిస్తామని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. దీని కోసం రైతులందరూ తమ భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు, పట్టాదారు పాస్‌బుక్‌లు, బ్యాంకు ఖాతాలు, ఆధార్ కార్డులను జిరాక్సు కాపీలను వీఆర్వోకు అందించాలన్నారు. భూములను రీసర్వే చేసే తేదీ, సమయాన్ని నోటీసుల రైతులకు తెలియజేస్తామన్నారు. గ్రామ రికార్డులతో రీసర్వే టీమ్ వీఆర్వో, గ్రామ సర్వేయర్, వీఆర్ఏ వస్తారన్నారు. ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన భూమి వద్దకు వెళ్లి రైతు సమక్షంలో సర్వే చేసి కొలతలను నిర్ధారణ చేస్తారని తెలిపారు.

టీడీపీ ఎమ్మెల్యేల వర్గపోరు

- జనరిక్ దుకాణం విషయంలో బయటపడిన విభేదాలు
- ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలు



జనరిక్ షాపు ముందు ఆందోళన చేస్తున్న ఒకవర్గం



సమీపంలో నిలబడి ఉన్న మరో వర్గం

కంబాలచెరువు: ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని జనరిక్ మందుల దుకాణాన్ని ఖాళీ చేయాలంటూ ఒక వర్గం, ఖాళీ చేయబోమని మరోవర్గం ఘర్షణ పడుతున్నాయి. అది కూడా అధికార పార్టీకి చెందిన ఇరు ఎమ్మెల్యేల వర్గీయులు ఇలా గొడవకు దిగడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. తమ దుకాణం ఖాళీ చేయాలని కొందరు వ్యక్తులు దౌర్జన్యం చేస్తున్నారంటూ సోమవారం కొందరు మహిళలు ప్రభుత్వాసుపత్రి జనరిక్ మెడికల్ షాప్ వద్ద ఆందోళన చేశారు. మరో వర్గం దుకాణం తాము దక్కించుకున్నామని, తమకు అప్పగించాల్సిందేనని కూర్చున్నారు. ఈ ఘటనలో ఒకరు ఆదిరెడ్డి అప్పారావు వర్గీయులు, మరొకరు గోరంట్ల పక్షం వారు. ఈ వివాదం చిలికి చిలికి గాలివానలా ముదిరి తెలుగుదేశం పార్టీలోనే వర్గ పోరాటాన్ని బయటపెట్టింది. మందుల షాపు దుకాణం నిర్వహిస్తున్న కాళీకృష్ణ మహిళా శక్తి సంఘం అధ్యక్షురాలు పిల్లా తనూజ మాట్లాడుతూ తమను బలవంతంగా ఖాళీ చేయాలని దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. తాము కొంతకాలంగా మందుల దుకాణం నిర్వహిస్తున్నామని, 2024 నుంచి 2029 వరకు తమకే కేటాయిస్తున్నట్లు జిల్లా సమాఖ్య తీర్మానించిందన్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తండ్రి అప్పారావు తన మనుషులతో దౌర్జన్యంగా ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సహాయంతో తాను ఈ దుకాణం నిర్వహిస్తున్నానని, దీన్ని స్థానిక టీడీపీ నాయకులు ఖాళీ చేయించేందుకు దౌర్జన్యం చేయిస్తున్నారన్నారు. దీనిపై ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మిసూర్యప్రభ మాట్లాడుతూ కాళీకృష్ణ మహిళా శక్తి సంఘానికి మందుల దుకాణం నిర్వహించేందుకు సమయం అయిపోయిందన్నారు. దీంతో వేరే మహిళా సంఘానికి కేటాయింపు జరిగిందన్నారు. గత మూడు నెలలుగా దీనిపై నోటీసులు ఇస్తున్నా స్పందన లేదన్నారు. కాగా.. దుకాణం నిర్వహణ సమయం పూర్తయితే టెండర్ ద్వారా లీజుకు ఇవ్వాలే కానీ, ఇష్టారాజ్యంగా నచ్చిన వారికి కేటాయించడమేమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఈ దుకాణ వివాదం వివాదాస్పదమైంది. ఒకవైపు ఆదిరెడ్డి వర్గీయులు మరోవైపు గోరంట్ల వర్గీయులు బైఠాయించడం జనాలను నివ్వెరపరిచింది. అధికార పార్టీలోని అంతర్గత మునలాన్ని బయటపెట్టింది.

ఆస్తి నేరాలను త్వరితగతిన పరిష్కరించండి



ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: జిల్లాలో గత ఐదేళ్లలో నమోదైన ఆస్తి నేరాలను త్వరితగతిన పరిష్కరించాలని, ఆస్తి నేరాల్లో నేరస్తులపై నిరంతరం నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ సూచించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని సీఐలు, ఎస్సైలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ గ్రేవ్ ప్రాపర్టీ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఆస్తి నేరాలలో పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఆస్తి నేరాల్లో అధికారులు ప్రత్యేక చొరవ చూపించి నిందితులను అరెస్టు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అనసూరి శ్రీనివాసరావు, పవన్ కుమార్ రెడ్డి, ఐటీ కోర్ సబ్ ఇన్‌స్పెక్టర్ అయ్యప్ప రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.